వేకువ
# సమయం

సంపుటి: 14 సంచిక: 114 VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: బుధవారం 13 మే 2026







**సమయం ప్రతినిధి:** ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** దేశంలో ఇంధన సరఫరాకు ఎలాంటి సమస్య లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. సీఐఐ వార్షిక వాణిజ్య సదస్సులో మంగళవారంనాడు ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో ప్రస్తుతం 69 రోజులకు సరిపడా క్రూడాయిల్, ఎల్ఎన్జీ నిల్వలు, 45 రోజులకు సరిపడా ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని తెలిపారు.

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా, నిరంతరాయ సరఫరాకు వీలుగా ప్రభుత్వం ఎల్పీజీ ఉత్పత్తిని రోజుకు 35,000–36,000 టన్నుల నుంచి 54,000 టన్నులకు పెంచిందని హర్దీప్ సింగ్ పురి చెప్పారు. ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. సంక్షోభాన్ని బాధ్యతాయుతంగా ఎదుర్కొంటున్నామని, ఎక్కడా ఎలాంటి డ్రై–ఔట్లు లేవని చెప్పారు. ఇంధన సరఫరా గొలుసు స్థిరంగా ఉందని స్పష్టం చేశారు.




**చెన్నై, సమయం ప్రతినిధి:** తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి విజయ్ TVK పార్టీ తన బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, AIADMK నిలువునా చీలిపోయింది. పార్టీ సీనియర్ నేతలు సి.వి. షణ్ముగం, ఎస్.పి. వేలుమణి నేతృత్వంలోని రెబల్ వర్గం ముఖ్యమంత్రి విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

**EPS పై తిరుగుబాటు:** పార్టీ జనరల్ సెక్రటరీ ఎడప్పాడి పళనిస్వామి (EPS)పై షణ్ముగం వర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రత్యర్థి పార్టీ అయిన DMK సాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు జూరా ప్రయత్నించారని, ఇది పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధమని వారు ఆరోపించారు. 'మా పార్టీ DMK ని వ్యతిరేకించేందుకే పుట్టింది. 53 ఏళ్లుగా మేము అదే పోరాటం చేస్తున్నాం. DMK తో కలిస్తే మా పార్టీ అస్తిత్వమే దెబ్బతింటుంది. అందుకే గెలిచిన విజయ్ పార్టీ (TVK) కి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం' అని షణ్ముగం స్పష్టం చేశారు.




**సిద్దిపేట, సమయం ప్రతినిధి:** బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఐదు గంటలుగా కొనసాగుతోంది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరుగుతోంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉప నాయకులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

## నీట్ పేపర్ లీకేజీపై నిరసన

### ఎన్‌టీఏను రద్దు చేయాలి.. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** నీట్–యూజీ 2026 పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ తెలంగాణ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో విద్యార్థులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, నీట్ పేపర్ లీకేజీ ఘటన దురదృష్టకరమని, లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రుల ఆశలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి చదివిన అర్హులైన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. అర్హత లేని వ్యక్తులు డాక్టర్లుగా మారితే దేశ ఆరోగ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలని, పేపర్ లీకేజీలకు పాల్పడిన వారిపై ఉరి శిక్ష విధించేలా చట్టాలను సవరించాలని అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రాసే పరీక్షలను ఒక్క ఏజెన్సీ చేతుల్లో పెట్టడం సరైన విధానం కాదని, కేంద్రానికి నిర్వహణలో సామర్థ్యం లేకపోతే రాష్ట్ర ప్రభుత్వాలకు పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో ఈ ఘటనపై విచారణ జరిపి, లీకేజీలో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఘటనపై స్పందించి విద్యార్థులకు భరోసా కల్పించాలని కోరిన ఆయన, గతంలో మహబూబ్‌నగర్ రైలు ప్రమాదం సందర్భంగా రైల్వే మంత్రి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే తరహాలో కేంద్ర విద్యాశాఖ మంత్రి కూడా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, నందగోపాల్, సాయి, సతీష్, ప్రవీణ్, హరిశంకర్, వినయ్, వినోద్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## ఉదండాపూర్ ఆర్‌అండ్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి

### నిర్వాసితులను వెంటనే పునరావాస కాలనీలోకి తరలించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**జడ్చర్ల, సమయం ప్రతినిధి :** ఉదండాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితుల పునరావాసం (ఆర్‌అండ్‌ఆర్) పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్వాసిత కుటుంబాలను వీలైనంత త్వరగా పునరావాస కాలనీలోకి తరలించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ఈ మేరకు సూచనలు చేశారు.

ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు చిన్నగుట్ట తండా, రేగడిపట్టె, తుమ్మలకుంట తండా, శామగడ్డ తండా, పోలేపల్లి హామ్లెట్ల నిర్వాసితులకు సంబంధించిన పునరావాస పనుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. పునరావాస కాలనీలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దేవాలయ నిర్మాణ పనులకు దేవాదాయ శాఖ నుంచి అవసరమైన డిజైన్ అనుమతులు తీసుకుని వెంటనే పనులు ప్రారంభించాలని, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, అంతర్గత రహదారులు, విద్యుత్ సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. నిర్వాసితులు తమకు కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. గ్రామాల్లో అధికారులు తరచూ పర్యటించి నిర్వాసిత కుటుంబాలతో నేరుగా మాట్లాడి చిన్నచిన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఇండ్ల నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణ సౌకర్యాలు సింగిల్ విండో విధానంలో అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కారణంగా మిగిలిన వ్యవసాయ భూములకు వెళ్లేందుకు బండ్ల బాటలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కోరగా, అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని జడ్చర్ల తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

2వ పేజీలో...



# సంపాదకీయం

## ఏ ఆకాంక్షలకీ రికార్డ్‌స్థాయి పోలింగ్‌లు

భారత ప్రజాస్వామ్యం అంత సంక్లిష్టమైంది మరొకటి లేదు. అలాగే దాని విశిష్టతలకూ కొదవలేదు. అక్షరాస్యత, రాజకీయ చైతన్యం అంతంతమాత్రంగా ఉన్న భారత్ లాంటి దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతం కాదని 1950ల్లో ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. ప్రజలందరికీ ఒకేసారి సమానహక్కులను కల్పించటం దుస్సాహసమనే విమర్శలూ వెలువడ్డాయి. అప్పట్లో చాలా సహేతుకం అన్పించిన ఆ వ్యాఖ్యానాలూ, విమర్శలూ కాలపరీక్షకు నిలవలేకపోయాయి. అక్షరాస్యత అంతంత మాత్రమే అయినా ప్రజలు ఓట్లు వేయటానికి ఉత్సాహం చూపారు. మొదటి సార్వత్రిక ఎన్నికల్లో 46శాతం మంది ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఆనాటికి దేశంలో అక్షరాస్యత 15శాతానికి కాస్త అటూఇటూగానే ఉంది. స్వాతంత్ర్య ఉద్యమానికి సారథ్యం వహించిన చరిత్రతో కాంగ్రెస్ కీర్తి ఘనంగా వెలిగిపోతున్న నేపథ్యంలో కూడా ప్రజలు ఆనాడు రాజకీయ పరిణతిని ప్రదర్శించారు. 489 స్థానాలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్‌ను 364 చోట్లే గెలిపించారు. మిగతా స్థానాల్లో ప్రతిపక్ష పార్టీలకూ, స్వతంత్ర అభ్యర్థులకూ పట్టంకట్టారు. కాంగ్రెస్ పార్టీకి పడిన ఓట్లు 45 శాతం దాటలేదు. తొలి ఎన్నికల్లో 46శాతం మంది పాల్గొనటం కూడా అప్పట్లో ఒక రికార్డు. అమెరికా పౌరులు కూడా అంతటి రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించలేదు. 1948 నాటికే దాదాపు వందశాతం అక్షరాస్యతను అమెరికా సాధించింది. అయినా ఆ ఏడాది అక్కడ జరిగిన ఎన్నికల్లో 52శాతం మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. నిజానికి ఆనాటికి అక్కడ అన్నివర్గాల వారికీ ఓటువేసే హక్కుల్లేవు. రకరకాల కారణాలతో పలు రాష్ట్రాల్లో నల్లజాతీయులకూ, స్థానిక ఆదిమవాసులకూ, మహిళలకూ ఓటు హక్కును నిరాకరించారు. ఆ పరిమితులు ఉన్నా అక్కడి అక్షరాస్యతతో పోల్చితే ఓటింగ్ శాతం తక్కువేనని చెప్పాలి. ఏ రూపంలోనూ, ఏ వర్గానికీ ఓటుహక్కుని నిరాకరించని దేశంగా భారత్ 1950 నాటికి ప్రపంచంలోనే విశిష్టస్థానాన్ని సంపాదించింది.

వాగ్దానాలు చేసినట్లుగా జీవితాల్లో ప్రగాఢమార్పులను తీసుకురాలేని రాజకీయాలు ఉన్నచోట ప్రజల్లో కొంత నిరాసక్తత వ్యక్తంకావటం సహజం. కానీ ఆ నిరాసక్తతను కూడా ప్రదర్శించకుండా ప్రజలు ప్రతి ఎన్నికల్లో అధికంగా ఓటింగులో పాల్గొనటం మన దేశంలోనే బాగా జరుగుతోంది. ఇటీవల ముగిసిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాలే అందుకు నిదర్శనం. సగటు పోలింగ్ 89.85 శాతం నమోదైంది. 2007–2026 మధ్య రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే పోలింగ్ గణనీయంగా పెరిగిన పరిస్థితే కనపడుతుంది. మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్ లాంటి చిన్న రాష్ట్రాల్లో మాత్రమే స్వల్ప తగ్గుదల కనపడింది. పెద్ద రాష్ట్రాల్లో పంజాబ్ మినహా ఎక్కడా ఈ పరిస్థితి లేదు. 2007లో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో 76.04 శాతంగా నమోదైన పోలింగ్ 2022 నాటికి 72.15 శాతానికి తగ్గిపోయింది. పోలింగ్ శాతాలనూ ఎన్నికల్లో పార్టీలు ప్రకటిస్తున్న వాగ్దానాలనూ చూస్తే ఒకటి స్పష్టంగా అర్థమవుతుంది. ప్రజల కోరికలూ ఆకాంక్షలూ పెరుగుతున్నాయి. వాటికి అనుగుణంగా పార్టీల వాగ్దానాలు, నగదు బదిలీల హామీలు అధికమవుతున్నాయి. కులం, మతం అనేవి టిక్కెట్ల పంపిణీలో, ఓటర్లను సమీకరించటంలో ఇంకా గట్టి పాత్రను పోషిస్తున్నా అవే ఎన్నికల ఫలితాలను నిర్ణయించే ప్రబలశక్తులుగా లేవు. నగదు బదిలీలు, సబ్సిడీలు, ఇళ్ల నిర్మాణాలు, స్థలాల కేటాయింపు లాంటివి ఓటర్లకు ప్రధానంగా మారాయి. వాటిని అధికంగా వాగ్దానం చేసే పార్టీల వైపు మొగ్గటం ఒక ప్రధాన ధోరణిగా 1990ల తర్వాత బాగా ఎక్కువగా కనిపిస్తోంది. సినిమా గ్లామర్ లాంటివి జనంలోకి చొచ్చుకువెళ్లటానికి తోడ్పడుతున్నా, ప్రజలు కోరుకునే ఉచితాలనూ సంక్షేమపథకాలనూ పెద్దఎత్తున అమలుచేస్తామని హామీలు ఇవ్వకుండా ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదు. తమిళనాడు ఎన్నికల్లో 108 స్థానాలు గెలుచుకున్న సినీ నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ కూడా పెద్దఎత్తున ఆ తరహా హామీలను ఇవ్వాల్సి వచ్చింది. వాటిని నిజాయితీగా అమలు జరిపితే ఏడాదికే అక్కడ రూ.90వేల కోట్లు అదనంగా ఖర్చుపెట్టాలి. జనాకర్షక పథకాలతో ఖజానాలు ఖాళీ అవుతున్నాయనీ అప్పుల ఊబిలోకి ప్రభుత్వాలను నెట్టివేస్తున్నాయనీ ఆర్థికవేత్తలూ వ్యాఖ్యాతలూ ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా పార్టీలు వాటిని పట్టించుకునే స్థితిలో లేవు. అంతకంటే ముఖ్యంగా వాటిని తగ్గిస్తే ఉపేక్షించటానికి ప్రజలు సిద్ధంగా లేరు. తాత్కాలిక ఉచితాలతో వారెందుకు సరిపెట్టుకుంటున్నారు? దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించే పథకాలకు ఎందుకు ఆకర్షితులు కావటం లేదు? అని ప్రశ్నించుకుంటే మన ఆర్థిక వ్యవస్థ నడుస్తున్న తీరునూ ప్రభుత్వాలు దాన్ని ప్రభావితం చేస్తున్న వైనాన్నీ లోతుగా పరిశీలిస్తే వీటికి కొంతైనా జవాబు దొరుకుతుంది. 1990ల తర్వాత ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ సంస్థల పాత్ర గణనీయంగా తగ్గిపోయింది. ప్రైవేటురంగంలో వ్యాపారాలనూ పరిశ్రమలనూ ఆరంభించటానికి ప్రభుత్వ అనుమతులు రావటం చాలా సులభమైంది. వాటికి చౌకగా భూములను కేటాయించటం, రాయితీ ధరలకు కరెంటు సరఫరా చేయటం, పన్నుల్లో మినహాయింపులు ఇవ్వటం, రుణాల వెసులుబాటును బాగా పెంచటం పెద్ద ఎత్తున మొదలయ్యాయి. ఇదే తరహా ప్రోత్సాహకాలను విదేశీపెట్టుబడిదారులకు కూడా కల్పించటం ఆరంభించారు. వీటన్నిటి ఫలితంగా ఆర్థికవృద్ధిరేటు బాగా పుంజుకుంది. 1990లకు ముందు ప్రభుత్వపరమైన అనేక కట్టడులతో, నియంత్రణలతో ఆర్థిక వ్యవస్థ ఆశించినంత వేగంగా కదలలేకపోయింది. ఉత్పత్తుల్లో వైవిధ్యం లేకుండా పోయింది. అందుబాటులో ఉన్న వస్తువులూ పరిమితంగా ఉండేవి. కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టటం చాలా ఆలస్యమూ అయ్యేది. ప్రపంచమార్కెట్‌లో లభ్యమయ్యే వస్తువుల్లో చాలా వరకూ దేశంలో దొరికేవి కావు. ఆర్థిక సంస్కరణలతో ఈ పరిస్థితి మొత్తం మారిపోయింది. ప్రపంచ మార్కెట్‌లో లభ్యమయ్యే వినియోగవస్తువులన్నీ ఇప్పుడు భారతదేశంలో అందుబాటులో ఉన్నాయి. వీటిని కొనుగోలుచేసే మధ్యతరగతి సంఖ్యా బాగా పెరిగింది. ఈ మార్పులన్నిటినీ అయిదు పదుల వయస్సు దాటిన వాళ్లందరూ ప్రత్యక్షంగా చూశారు. 1997 తర్వాత పుట్టిన జెన్––జీ తరానికి అంతకుముందున్న ఆర్థిక జీవితం గురించి పెద్దగా తెలియదు. ప్రతి విషయాన్ని స్మార్ట్‌ఫోన్ల ద్వారానే తెలుసుకునే వారికి సామాజిక మార్పులను గ్రహించే అవకాశం ఉండటం లేదు.

## వేసవిలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

**-రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



**వనపర్తి, సమయం ప్రతినిధి:** కొల్లాపూర్ నియోజక పరిధిలోని చిన్నంబావి, వీపనగండ్ల, పానగల్ మండలాలు, ఎదుల మండలంలోని 5 గ్రామ పంచాయతీలకు వేసవి కాలంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నీ స్టేట్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూడు మండలాల గ్రామ సర్పంచులు, ఎ. ఈ లు సైతం పాల్గొన్న ఈ సమీక్ష సమావేశంలో తాగు నీటి సమస్య ఉన్న గ్రామ సర్పంచులు ఒక్కో గ్రామ పంచాయతీ వారిగా తమ సమస్యలను మంత్రి దృష్టికీ తీసుకువచ్చారు. అక్కడే ఉన్న మిషన్ భగీరథ అధికారులు, ఎ. ఈ లు సమస్యకు గల కారణాలను, సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి 2040 జనాభా అంచనా ప్రకారం రూపొందించిన మిషన్ భగీరథ తాగు నీరు 2026 నాటికే ప్రజలకు పూర్తిస్థాయిలో అందకపోవడం ఏంటనీ ప్రశ్నించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిష్కార మార్గాలను అన్వేషించి ప్రజలకు తాగు నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. వచ్చే వారంలో మరోసారి సమీక్ష నిర్వహిస్తామని ఆలోగా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఐ.డి.ఓ.సి. సమావేశ మందిరంలో రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్.అండ్ బి శాఖకు మంజూరు అయిన ప్లాన్, నాన్ ప్లాన్ పనుల పురోగతి పై సమీక్ష నిర్వహించారు. వనపర్తి – కొల్లాపూర్ వెంగళాయపల్లి రోడ్డు విస్తరణ పనులు, కేతేపల్లి సి.సి రోడ్డు పనులు మధ్యలో ఎందుకు ఆగిపోయాయని ఆర్ అండ్ బి కార్యనిర్వహక ఇంజనీరును ప్రశ్నించారు. ఒక్కో పనిలో దాదాపు 50 లక్షల పనులు పూర్తి అయ్యాయని, కానీ ఇప్పటి వరకు పని చేసిన దానికి డబ్బులు మంజూరు కానందున కాంట్రాక్టర్లు పనులు ఆపేశారని మంత్రి దృష్టికీ తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి మధ్యలో ఆగిపోయిన అన్ని పనులకు తన రిఫరెన్స్ తో ప్రభుత్వానికి లేఖలు రాయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఆర్డీఓ సుబ్రమణ్యం, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, ఆర్ అండ్ బి ఈ.ఈ దేశ్యా నాయక్, ఎస్.ఈ మిషన్ భగీరథ, ఈ.ఈ అంజద్ పాషా, ఎస్.డి.సి తిరుపతయ్య, డి. ఈ లు, ఎ.ఈ లు, ఇతర అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## బండి విషయంలో సీఎం ఎంట్రీ...

కరీంనగర్ : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఒక మైనర్ బాలిక పట్ల అసభ్య ప్రవర్తనకు పాల్పడ్డారన్న ఆరోపణలు, దానిపై నమోదైన కేసు లు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ ఉదంతాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బాధితులకు న్యాయం చేయడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు.ఈ కేసు నమోదులో జరిగిన జాప్యంపై సీఎం రేవంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. దీనిపై డీజీపీ సీవీ ఆనంద్‌ను స్వయంగా పిలిపించి వివరణ కోరారు. ఈ నెల 8నే బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ, నిందితులపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరగడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైందని, అందుకే జాప్యం జరిగిందని డీజీపీ సీవీ ఆనంద్ వివరణ ఇచ్చారు.కేసు పూర్వాపరాలను నిశితంగా పరిశీలించిన ముఖ్యమంత్రి, తక్షణమే సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపాలని, ఎక్కడా సాక్ష్యాలు తారుమారు కాకుండా పారదర్శకమైన నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. “న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని” అధికారులను హెచ్చరించారు.తన 17 ఏళ్ల కుమార్తెను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఓ తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పేట్‌బషీరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలు మైనర్ కావడంతో నిందితుడిపై కఠినమైన సెక్షన్లను ప్రయోగించారు. బాలికపై లైంగిక వేధింపులు, అనుచిత ప్రవర్తన వంటి అంశాల ఆధారంగా ఈ అభియోగాలు మోపారు.కేసు విచారణ సాగుతుండగానే ఈ ఉదంతం మరో మలుపు తిరిగింది. సదరు బాలిక తల్లిదండ్రులు తనను డబ్బుల కోసం బెదిరిస్తున్నారంటూ భగీరథ్ కరీంనగర్ పోలీసులను ఆశ్రయించారు. తన ప్రతిష్ఠను భంగం కలిగించేలా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కరీంనగర్ టూటౌన్ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. దీంతో ఈ కేసు ఇరుపక్షాల ఫిర్యాదులతో క్లిష్టంగా మారింది.రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించినట్లు తెలుస్తోంది. కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్ రెడ్డి ఇప్పటికే సైబరాబాద్ సీపీ నుంచి పూర్తి స్థాయి నివేదికను తెప్పించుకున్నారు. దీనిపై లోతైన విచారణ జరిపేందుకు కమిషన్ ఒక ప్రత్యేక బెంచ్ ను ఏర్పాటు చేసింది. బాలిక భద్రత, మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని కమిషన్ విచారణను వేగవంతం చేయనుందిముఖ్యమంత్రి నేరుగా జోక్యం చేసుకోవడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రాబోయే 24 గంటల్లో ప్రత్యేక బృందాలు బాధితులు, సాక్షుల నుంచి వాంగ్మూలాలను సేకరించనున్నాయి. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ కేసులో తదుపరి అరెస్టులు లేదా ఇతర చర్యలు ఉండవచ్చు. రాజకీయంగా కూడా ఈ అంశం కాక రేపుతోంది. విచారణ పారదర్శకంగా జరగాలని అధికార పక్షం అంటుంటే, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తమ కుమారుడిని ఇరికించారని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఏది ఏమైనా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, శాంతిభద్రతల విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## మోడీ గ్రేటర్ వ్యూహం...

హైదరాబాద్ : తెలంగాణలో పర్యటించారు ప్రధాని నరేంద్ర మోడీ. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు పదివేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ జరిగింది. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డితో సైతం సన్నిహితంగా మెలిగారు ప్రధాని. ఒక విధంగా చెప్పాలంటే పక్క పొలిటికల్ వ్యూహంతోనే సాగింది నరేంద్ర మోడీ పర్యటన. అయితే మరోవైపు హైదరాబాదులో ఉంటున్న ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులతో గడిపారు మోదీ. అయితే దీని వెనుక గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల వ్యూహం ఉన్నట్టు అర్థం అవుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనలను గమనిస్తే ఒక వ్యూహం ప్రకారమే సాగుతుంటాయి. ఇప్పుడు చంద్రబాబుతో పాటు పవన్ విషయంలో కూడా ప్రధాని ఆలోచన అదేనని ఒక టాక్ నడుస్తోందిమరి కొద్ది రోజుల్లో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. భారతీయ జనతా పార్టీ వీటిని ఒక సెమీఫైనల్స్ గా భావిస్తున్నాయి. అందుకే ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ఎన్నికల్లో సైతం ఇక్కడ మంచి ఫలితాలు సాధించింది.. అందుకే ఈసారి మేయర్ పీఠం సాధించడం ద్వారా తెలంగాణలో తామే ప్రత్యామ్నాయం అన్నట్టు సంకేతాలు పంపాలని చూస్తోంది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ స్వయంగా రంగంలోకి దిగారు. చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ ఇళ్లకు వెళ్లి.. టిడిపి తో పాటు జనసేన మద్దతును పరోక్షంగా పొందినట్టు అర్థం అవుతోంది.గ్రేటర్ పరిధిలో టిడిపికి క్యాడర్ ఉంది. ఒక బలమైన సామాజిక వర్గం దన్ను ఉంది. ఆ రెండింటిని తిప్పుకుంటే బీజేపీకి ఇక్కడ ప్లస్ పాయింట్ అవుతుంది. పైగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ కూడా గ్రేటర్ పరిధిలో ఎక్కువ. ఏపీలో ప్రధాన భాగస్వామ్య పక్షాలుగా ఉండడంతో సెటిలర్స్ తప్పకుండా బిజెపి వైపు మొగ్గు చూపుతారని అంచనాలు ఉన్నాయి. అయితే ఆ ఇద్దరు నేతలను కలవడం ద్వారా సరికొత్త సంకేతాలను పంపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పోటీకి దూరంగా ఉండిపోయింది. అది అంతిమంగా కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చిందని విశ్లేషణలు ఉన్నాయి. ఒకవేళ గ్రేటర్ ఎన్నికల పరిధిలో టిడిపి ఓటు బ్యాంకును బిజెపి వైపు మళ్లించగలిగితే.. భారతీయ జనతా పార్టీ గెలుపు నల్లేరు మీద నడక కానుంది. ఆ ఉద్దేశంతోనే చంద్రబాబు ఇంటికి వెళ్లిన మోడీ గంటా పది నిమిషాల పాటు ఆయన కుటుంబ సభ్యులతో గడిపారు.పవన్ కళ్యాణ్ బిజెపికి సానుకూలంగా ఉంటారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లోనే బీజేపీతో కలిసి పోటీ చేశారు కొన్నిచోట్ల. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకున్నారు. తెలంగాణ కంటే గ్రేటర్ పరిధిలో పవన్ కళ్యాణ్ అభిమానులు ఎక్కువ. అందుకే వారిని మచ్చిక చేసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోడీ పరామర్శ పేరుతో పవన్ ఇంటికి వెళ్లారు అనేది పొలిటికల్ వర్గాల్లో వినిపిస్తున్న మాట.

## ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ పనులు వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఇక వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, వచ్చే పది రోజుల్లో అన్ని ఫైళ్లను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలపై కూడా కలెక్టర్ సమీక్షించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌లలో లీకేజీలు, దెబ్బతిన్న ప్రాంతాలను వెంటనే మరమ్మతు చేయాలని, నీటి సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లు లేదా బోర్‌వెల్‌ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ చేసినప్పటికీ ఇప్పటివరకు ఒక్క కుటుంబం కూడా పునరావాస కాలనీలోకి వెళ్లకపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు తరహాలో ప్లాట్లను లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేస్తే ఇళ్ల నిర్మాణానికి ముందుకు వస్తారని అభిప్రాయపడ్డారు.

రోడ్లు, ఆలయాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలు, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు, విద్యుత్ సదుపాయాల వంటి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. పునరావాస కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను నాగసాలకు తరలిస్తే నిర్వాసితులు కాలనీలోకి రావడానికి ఆసక్తి చూపుతారని సూచించారు.

జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలు, వాగుల మళ్లింపులపై వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, డీఆర్వో రామ్‌రెడ్డి, ఆర్డీవో నవీన్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దేవాలయాలు సమాజ ఐక్యతకు ప్రతీకలు : ప్రభుత్వ విప్







## మహబూబ్‌నగర్‌లో ఆంజనేయ స్వామి, గరుత్మంతుడి విగ్రహాల ఆవిష్కరణ

**మహబూబ్ నగర్, సమయం ప్రతినిధి :** మహబూబ్‌నగర్ నగరంలోని సింహగిరి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆంజనేయ స్వామి గరుత్మంతుడి సుధామూర్తుల విగ్రహాలను ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు పుజమాలలు వేసి భక్తి శ్రద్ధలతో అలంకరించారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు వేద ఆశీర్వాదాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవాలయ అభివృద్ధి కోసం ముడా నిధుల కింద రూ.10 లక్షల వ్యయంతో గ్రీనరీ అభివృద్ధి, డ్రిప్ సిస్టమ్ ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాక సమాజ ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యాల కోసం అవసరమైన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు దేవాలయ ప్రాంగణంలో చేపడతామని తెలిపారు. శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయ క్షేత్రపాలకులైన గరుత్మంతుడు, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన జరుపుకోవడంతో ఇప్పుడు ఆలయం సంపూర్ణ రూపాన్ని సంతరించుకుందని, ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని క్షేత్ర పాలకుల విగ్రహాలు ఆవిష్కరించే భాగ్యం తనకు కలగడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ ఆలయం దేదీప్యమానంగా వెలుగుతూ భక్తుల కోరికలు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారు నెరవేర్చాలని ఆయన ఆకాంక్షించారు. దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, దేవాలయ సుందరీకరణ కమిటీ అధ్యక్షులు పోల శ్రీనివాస్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ కృష్ణయ్య, తిరుపతి నాయక్ ఆలయ కమిటీ సభ్యులు నాయకులు చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతాలు సృష్టిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు : ఎమ్మెల్యే



**మహబూబ్ నగర్, సమయం ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో హన్వాడ మండలం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా వారిని ఎమ్మెల్యే గారు తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సి. చరణ్ కుమార్ (473 మార్కులు), డి. విజయలక్ష్మి (468 మార్కులు), డి. రాకేష్ (452 మార్కులు), ఎన్. అక్షయ (443 మార్కులు), పి. కార్తిక్ (431 మార్కులు) అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. రాబోయే పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విద్యలో అగ్రస్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత సరైన దృష్టి పెట్టి ఉంటే రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందేదని అన్నారు. పేద విద్యార్థులు చదువుకోవాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని, కార్పొరేట్ స్థాయిని తలదన్నే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. ఉపాధ్యాయులు వెనుకబడిన, పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు సాయినాథ్, శ్రీనాథ్, వెంకటేష్, షాబుద్దీన్, కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మే 15న గ్రామీణ ఉపాధి కూలీల దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయండి

**ఆత్మకూరు :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు యస్. అజయ్.రైతు సంఘశీ జిల్లా కోశాధికారి బి. వెంకటేష్‌లు ఆత్మకూరు మండలంలోని గుంటిపల్లిలొ మంగళవారం నాడు మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు గత రెండు నెలలుగా కూలీపని చేసినడబ్బులు రాకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతిరోజు ఉపాధి పని ప్రదేశంలో రెండు పూటల ఫోటో క్యాప్చర్ తీసే విధానంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు అడవులలో పనులు జరగడం వల్ల నెట్వర్క్ రాకపోవడంతో కూలీలు ఎంతో దూరం నుంచి వచ్చిన ఫోటోకాప్చర్ రాకపోవడంతో వెనుతిరిగి ఆరోజుపూర్తిగా పని కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని. నెట్వర్కు రానిప్రదేశంలో ఆఫ్లైన్ అటెండెన్స్‌కు అవకాశం ఇవ్వాలనికోరారు పని ప్రదేశంలో మంచినీటి వసతి ప్రతిరోజు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ. తట్ట బుట్ట ఫస్ట్ ఎయిడ్ బాక్స్ పారలు. టెంట్లు సరపరచేయాలనీ కోరారు కొలతల పద్ధతిని రద్దుచేసి రోజు కూలి600 ఇవ్వాలని ఏడాదికి 200 ఉపాధి పని దినాలను కల్పించాలని మహాత్మా గాంధీ జాతీయ పథకం స్థానంలో కొత్తగా తెచ్చిన నరేగా స్కీంను రద్దుచేసి పాత పద్ధతిలోనే కేంద్రం 90 శాతం. రాష్ట్రం 10% నిధులను భరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి సిబ్బంది 4నెలల వేతనబకాయిలు ఇవ్వాలని. ఫీల్డ్ అసిస్టెంట్ లకు 26000కనీసవేతనం అమలు చేయాలనీ డీమాండ్ చెశారు ఇందిరమ్మ ఆత్మీయ



భరోసా ద్వారా భూమి లేని. పెదలకు ఏడాదికి యిచ్చే 12000.కు నిధులు ఇవ్వాలని కోరారు. పని ప్రదేశంలో టెంట్లు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలనీ కోరారు. ఈ డీమాండ్ల సాధన కై 15న జరుగు ఉపాధి కూలీల దేశవ్యాప్తంగాజరుగు సమ్మెలొకూలీలు పెద్ద ఎత్తున పాల్గొనివిజయవంతం చేయాలనీ పిలుపునీచ్చారు కార్యక్రమంలో.పోలన్న. నారాయణ రెడ్డి.నిర్మల. గోవిందమ్మా. మన్నెమ్మ శేఖర్. చిన్న మసన్న తదితరులు పాల్గొన్నారు.

## నేపాలి కల్పన మామూలు లేడీ కాదు..

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ ప్రాంతంలో ప్రశాసన్ నగర్ అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. ఇంతటి భద్రత ఉండే ప్రాంతంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ (60) ఇటీవల ప్రాణాలు కోల్పోయారు. ఆమెను దారుణంగా అంతం చేశారు. ఈ ఘటనలో నిందితుల కోసం పోలీసులు విపరీతంగా శ్రమిస్తున్నారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాన్ని పోలీసులు ఇప్పటికే ఒక అంచనాకొచ్చారు. ఆమె అత్యంత కఠినమైన పరిస్థితుల్లో ప్రాణం కోల్పోయారని పోలీసులు పేర్కొన్నారు. పోస్ట్ మార్టం నివేదికలో కూడా ఇదే తేలింది.ప్రశాసన్ నగర్ లో భద్రత చాలా కట్టు దిట్టంగా ఉంటుంది. పోలీసులు కూడా నిత్యం గస్తీ కాస్తూనే ఉంటారు. అయినప్పటికీ ఈ ఘటన ఎందుకు జరిగిందనేది అర్థం కావడం లేదు. ఈ ఘటన జరిగిన తర్వాత పోలీసులు దాదాపు 200కు పైగా సిసి టీవీల కేమెరాల ఫుటేజీ పరిశీలించారు. అంతేకాదు కొంతమంది పోలీసులు శుక్రవారం సాయంత్రం నేపాల్ వెళ్లినట్టు తెలుస్తోంది.ఈ ఘటనలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్పన, మరో ఇద్దరు జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆటోలో ఎక్కారని.. వారు నాంపల్లి ప్రాంతంలో దిగినట్టు ఆధారాలు లభించాయి.. వారు నాగ్ పూర్ ప్రాంతానికి వెళ్లి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ప్రాంతానికి వెళ్లడానికి వారు తెలంగాణ ఎక్స్ ప్రెస్ ఎక్కినట్టు తెలుస్తోంది. వి నేపథ్యంలో పోలీసులు ముందుగానే అక్కడికి వెళ్లారు. రైలు భోగిలలో విస్తృతంగా తనిఖీలు చేశారు. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. పోలీసులను తప్పు దోవ పట్టించేందుకు ఈ ఘటనకు పాల్పడిన వారు మధ్యలోనే దిగి ఉంటారని తెలుస్తోంది.కల్పన నేపాల్ దేశానికి చెందిన యువతి. ఈమెకు డబ్బు పిచ్చి చాలా ఎక్కువ. పైగా విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో డబ్బు బాగా ఉంటుందని ఒక అంచనాకొచ్చింది. పైగా ఈమె వెనుక ఒక ముఠా కూడా ఉంది. కొద్దిరోజుల క్రితం విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ ఇంట్లో పని మనుషులు కావాలని తెలిసింది. దీంతో ఆ ముఠా మనుషులు రంగంలోకి దిగారు. విశ్రాంత ఐపీఎస్ అధికారితో మాట్లాడారు. కల్పన మీ ఇంట్లో పని చేసేందుకు వస్తుందని చెప్పారు. దానికి ఆయన ఒప్పుకున్నారు. అప్పటినుంచి కల్పన వినయ్ ఇంట్లో పని చేస్తోంది. వినయ్ ఈమెను ఇంట్లో మనిషి లాగా నమ్మారు. పైగా ఆయన భార్యకు ఆరోగ్యం అంతంత మాత్రమే. పిల్లలు వేరే ప్రాంతాలలో స్థిరపడ్డారు.. ఇటీవల వినయ్ ఆరోగ్యం సరిగా లేకపోతే బెంగళూరు వెళ్లారు.

## ఆంజనేయ స్వామిని దర్శించుకున్న మంత్రి



**హైదరాబాద్ :** హనుమాన్ జయంతి ని పురస్కరించుకొని హైదరాబాద్ చింతల్ బస్తి లో ఆంజనేయ స్వామి ని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి దర్శించుకున్నారు. మక్తల్ నియోజకవర్గ ప్రజలపై, రాష్ట్ర ప్రజలపై ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

## జిల్లా SC & ST విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు...!

### అలంపూర్ నియోజక వర్గం నుంచి ముగ్గురు సభ్యులు ఎంపిక.



**అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా SC & ST విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ సభ్యులుగా అలంపూర్ నియోజక వర్గం నుంచి నియమింపబడిన

1. డి నరసింహులు (అలంపూర్)
2. మాల మల్లిఖార్జున్ (ఐజ)
3. భుక్య శైలజ (ఐజ)

ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్‌ని కలిసి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలుపడం జరిగింది.బిఅలంపూర్ మాజీ శాసనసభ్యులు ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ.సంపత్ కుమార్ శాలువ కప్పి వారిని అభినందించడం జరిగింది.

## నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాల అక్రమ రవాణా భగ్నం

### షామీర్‌పేట్‌లో 100 కిలోల విత్తనాల స్వాధీనం.. ఒకరు అరెస్ట్

**మేడ్చల్ జిల్లా..శామీర్ పేట...**

**సమయం ప్రతినిధి :** నిషేధిత బీటీ–3 (బీజీ–ఎఎఎ హెచ్‌పీ వెరైటీ) పత్తి విత్తనాల అక్రమ రవాణా, విక్రయ యత్నాన్ని ఎస్‌వోటీ కంటోన్మెంట్ బృందం భగ్నం చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి షామీర్‌పేట్ పోలీసుల సహకారంతో శనివారం సాయంత్రం ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.7 సమీపంలో తనిఖీలు నిర్వహించగా, నిషేధిత విత్తనాలను విక్రయించేందుకు తీసుకెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా చెబ్రోలు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు (58) వద్ద రెండు సంచుల్లో మొత్తం 100 కిలోల బీటీ–3 పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. ఒక్కో సంచిలో 50 కిలోల చొప్పున విత్తనాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.విచారణలో భాగంగా నిందితుడు, తన సహచరుడు దాసరి సూరిబాబుతో కలిసి అన్నమయ్య జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు వద్ద తక్కువ ధరకే విత్తనాలు కొనుగోలు చేసి, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రైతులు, ఎరువుల దుకాణాలకు అధిక ధరలకు విక్రయించాలని యత్నించినట్లు వెల్లడించినట్టు పోలీసులు తెలిపారు.

# మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకూడదు




**కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి వెంటనే రశీదులు ఇవ్వాలి**
**హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి : సీఎం రేవంత్ రెడ్డి**

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్ :** మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి రైతులకు వెంటనే రశీదులు అందించాలని, స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకోవాలని సూచించారు.మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే జిల్లాల్లోని ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని నిల్వ సదుపాయాలు పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని తెలిపారు. రవాణా కోసం ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను పూర్తి స్థాయిలో వినియోగించాలని ఆదేశించారు.జిల్లాల్లో స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. ఎక్కడా హమాలీల కొరత రాకుండా చూడాలని, హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచి, తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని అధికారులకు సూచించారు.

పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ.3,873 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. హమాలీలు, రవాణా సమస్యలపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈసారి భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన బందోబస్తు, విజిలెన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాల సూచనలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని, రాబోయే నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి జిల్లా స్థాయిలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్ల కోసం నియోజకవర్గాల వారీగా సీనియర్ అధికారులను, రెండు నుంచి మూడు కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక అధికారులను మానిటరింగ్ కోసం నియమించనున్నట్లు తెలిపారు. ధాన్యం రవాణా, హమాలీల సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని, వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ మార్పులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. మీడియా ద్వారా వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డీఎం రవి నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. వెంకటేష్, జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, జిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్, జిల్లా రవాణా అధికారి రఘు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో డిప్యూటీ మేయర్ ఎమ్మెస్సార్



మహబూబ్ నగర్ : నియోజకవర్గం లోని హన్వాడ మండలం కేంద్రంలోని దాచక్ పల్లి గ్రామ పంచాయతీ లోని దయ్యాలా మర్రి తండాలో లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి(MSR) పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దాచక్ పల్లి గ్రామంలో నూతన వేసిన మంచినీటి బోరును ప్రారంభించారు. గ్రామ నాయకుడు టిక్య నాయక్ కుమార్తె ప్రధన కార్యక్రమంలో హాజరై వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల్ ప్రెసిడెంట్ V. మహేందర్ జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ జీ. వెంకటయ్య, గ్రామ సర్పంచ్ శ్రీలత కృష్ణ, ఉప సర్పంచ్ శంకర్ నాయక్, శశికల, నాగ్య నాయక్, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కేశం ను సత్కరించిన గౌడ సంఘం నేతలు



**అమరచింత :** తెలంగాణ రాష్ట్ర కల్లుగీత సహకార అభివృద్ధి శాఖ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులైన కేశం నాగరాజు గౌడ్‌ని కలిసి శాలువాతో మహబూబ్నగర్ జిల్లా గౌడ సంఘ అధ్యక్షులు ఆనంద్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మక్తల్ నియోజక వర్గం విష్ణువర్ధన్ రెడ్డి సత్కరించే అభినందనలు తెలిపారు.

## యువకుడి హత్య కేసును ఛేదించిన బాలాపూర్ పోలీసులు

రంగారెడ్డి : హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు కేవలం 12 గంటల్లో చేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.ఉస్మాన్ నగర్ ప్రాంతంలో అదిత్ పాండే ఏ భజరంగ్ (24) అనే యువకుడిని పాత కక్షల నేపథ్యంలో దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు మృతుడిని మద్యం తాగుదామని నమ్మబలికి పిలిపించి, అనంతరం అతనిపై ఇనుప రాడ్లు, రాళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.

# పాలిసెట్- 2026 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్**



**సమయం ప్రతినిధి, నల్లగొండ:** ఈనెల 13న నిర్వహించనున్న పాలిసెట్-2026 పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. పాలిసెట్- 2026 పరీక్ష నిర్వహణ విషయమై మంగళవారం అయన తన చాంబర్లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పాలిసెట్-2026 పరీక్ష నిర్వహణకుగాను నల్గొండ జిల్లాలో మొత్తం 15 పరీక్ష కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందని, నల్గొండ పట్టణంలో 13, నాగార్జునసాగర్ లో 2 కేంద్రాలు ఏర్పాటు చేశామని, పాలిసెట్ పరీక్షకు 5810 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని,పరీక్ష ఈ నెల 13 న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు ఉంటుందని తెలిపారు. పాలిసెట్ పరీక్ష సక్రమంగా నిర్వహించేందుకుగాను అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అడిషనల్ ఎస్పీ రమేష్ ను కోరారు.పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు తో పాటు, పేపర్ ను భద్రపరిచేందుకు ఎస్కార్ట్ ,అవసరమైన ఇతర భద్రత సౌకర్యాలను కల్పించాలని కోరారు.అదేవిధంగా పరీక్ష రోజున పరీక్షా కేంద్రాల పరిధిలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను, అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిధిలో బిఎన్ఎస్ 163వ సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. పరీక్ష రోజున ఆర్టీసీ అధికారులు అవసరమైనన్ని బస్సులను నడపాలని ఆర్ టి సి అధికారులను ఆదేశించారు. పాలిసెట్- 2026 నిర్వాహకులు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జిల్లా కో-ఆర్డినేటర్ సిహెచ్ నరసింహారావు, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, ట్రాన్స్కో, ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# నీట్ పరీక్ష రద్దు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే

**22 లక్షల మంది విద్యార్థులతో చెలగాటం**
**లీకేజికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి**
**బీఎస్పీ అలంపూర్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి శాంతి రాజు**




**ఆలంపూర్, సమయం ప్రతినిధి:** దేశవ్యాప్తంగా మే మూడవ తేదీన జరిగిన నీట్ పరీక్ష రద్దుకు నూటికి నూరు శాతం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని బహుజన్ సమాజ్ పార్టీ ఆలంపూర్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి శాంతి రాజు అన్నారు. మంగళవారం ఆయన ఎర్రవల్లి మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వం కాదని లీకేజీల ప్రభుత్వమని విమర్శలు చేశారు. నీటి పరీక్షకు దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులకు పైగా హాజరయ్యారని.. ఆ విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. విద్యావ్యవస్థ పై కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. 24 గంటలు కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలు పరీక్ష రద్దుతో అగమ్యగోచరంగా తయారయ్యాయని అన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలన్నారు. కేసు విచారణను సిబిఐ కి అప్పగించి లీకేజికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చట్టాలను అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వము ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నీట్ పరీక్ష రద్దు పై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎర్రవల్లి మండల అధ్యక్షులు ధర్మవరం రాముడు, బొచ్చు వెంకన్న పల్లి గ్రామ అధ్యక్షుడు హుస్సేన్, బహుజన్ సమాజ్ పార్టీ సీనియర్ నాయకుడు బుచ్చన్న, ఏసు ఇతరులు పాల్గొన్నారు.

## 47 డిగ్రీలకు చేరిన టెంపరేచర్

అదిలాబాద్ : తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. మే 14వ తేదీ నుంచి మే 21వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన వడగాల్పులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. గడిచిన కొద్ది రోజులుగా కురిసిన అకాల వర్షాల వల్ల కాస్త ఉపశమనం లభించినప్పటికీ.. ఇకపై భానుడి భగభగలు రెట్టింపు కానున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ వెల్లడించారు. ప్రధానంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరనుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల సెల్సియస్ దాటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కుమురం భీమ్ ఆసిఫాబాద్ వంటి జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలను రెడ్ మార్క్ జిల్లాల జాబితాలో చేర్చారు. ఈ ప్రాంతాల్లో మే 14 నుండి వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందన్నారు. గాలిలో తేమ శాతం తగ్గి, పొడి గాలులు వీయటం వల్ల వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

# గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసింది : ప్రభుత్వ విప్







**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** నగరంలోని పురాతన ఎంబీసీ జూనియర్ కళాశాలలో ముడా నిధుల 18 లక్షలతో నిర్మించనున్న టాయిలెట్ నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యాసంస్థలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆయన ఆరోపించారు. ఈ విద్యాసంస్థ ద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడ్డారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ కళాశాల నుంచి మరెంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల తరగతి గదులను ఎమ్మెల్యే పరిశీలించారు. కళాశాలలో ఉన్న వసతులను సౌకర్యాలను , కోర్సుల వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పీకే తిమోతి, నాయకులు చిన్న రాజు, టైటర్ రాజేందర్, సామెల్ దాసరి, ఎంబీసీ చర్చ్ ఉపాధ్యక్షులు జాకబ్ డేవిడ్ స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథును వెంటనే అరెస్టు చేయాలి




సమయం ప్రతినిధి : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ మైనర్ బాలిక అయినటువంటి 17 సంవత్సరాల అమ్మాయిని అత్యాచారం చేసి పరారీలో ఉన్న సాయి భగీరథుని వెంటనే అరెస్టు చేయాలి తన తండ్రి కేంద్ర సహాయ హోం శాఖ మంత్రి పదవిలో ఉండి ఇలాంటి అత్యాచారాలకు పాల్పడుతున్న కొడుకు సాయి భగీరథుని తండ్రి పెంపకం ఈ విధంగా ఉంది బిజెపి పార్టీ సనాతన ధర్మం అంటూ ప్రజలను మోసం చేస్తూ ఎవరు మాట్లాడినా ఎన్కౌంటర్లు చేస్తూ ఇలాంటి శిక్షణ పెంపకంలో తండ్రి పాత్ర ఎంతో ఉంటది కాబట్టి బండి సంజయ్ గారు కేంద్ర సహాయ హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలి భారతదేశంలో రాజ్యాంగం ప్రకారం పేదలకు ఒక న్యాయం అధికారం డబ్బు పలుకుబడి ఉన్న వాళ్లకు ఒక న్యాయం ఉండకుండా బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథును వెంటనే అరెస్టు చేయాలి కేంద్ర సహాయ హోం మంత్రి పదవిలో ఉండి పరారీలో ఉన్నాడు అనడం విడ్డూరంగా ఉంది కనుక ఈరోజు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అమరచింత పట్టణ కార్యదర్శి ఏ రవీందర్ సీనియర్ కామ్రేడ్ శ్యాంసుందర్ సహకార దర్శి కే లక్ష్మీనారాయణ ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా కార్యదర్శి గీతమ్మ గోవిందమ్మ ఇజ్రాయిల్ R n కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీసు భద్రత జిల్లా అదనపు ఎస్పీ

**రాజేష్ మీనా, ఐపీఎస్.,**

**పరీక్షా కేంద్రాల వద్ద BNSS-163 (144 సెక్షన్) అమలు**

**జిరాక్స్ సెంటర్ల మూసివేయాలని అదనపు ఎస్పీ ఆదేశాలు**

**విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లాలోని అన్ని ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, తెలిపారు.**



వనపర్తి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 13వ తేది నుండి 21వ తేది వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల సందర్భంగా, వనపర్తి జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు పరిరక్షించేందుకు BNSS-2023 సెక్షన్ 163 (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. వనపర్తి జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధం. ఈ ఆంక్షలు ఈ నెల 13వ తేది నుండి 21వ తేది వరకు వరకు సెక్షన్ 163 అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు పరీక్షల సమయంలో తప్పనిసరిగా మూసివేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ అధికారులకు పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ వాచీలు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావద్దని సూచించారు. పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్లు మరియు పోలీస్ సిబ్బంది మొబైల్ ఫోన్ల వినియోగాన్ని కూడా నిషేధించారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లా పోలీస్ శాఖ సంపూర్ణ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు ప్రజలు మరియు తల్లిదండ్రులు పోలీసుశాఖకు సహకరించాలని జిల్లా అదనపు ఎస్పీ కోరారు.

# వడదెబ్బ నివారణ, క్షయ నిర్ధారణ, దోమల వ్యాధుల నియంత్రణపై జిల్లా వైద్యశాఖ ప్రత్యేక చర్యలు



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:**"ప్రజా పాలనా-- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బ నివారణ చర్యలను ముమ్మరం చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న 259 మంది కూలీలకు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు వివరించి, 2,132 ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఇదే కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్ధారణపై ప్రత్యేక దృష్టి సారించిన వైద్యశాఖ, నవాబ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎన్మాన్‌గండ్ల, రుద్రారం గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించింది. ఈ శిబిరాల్లో 203 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా, 25 మందికి తెమడ పరీక్షలు చేసి క్షయ వ్యాధి నిర్ధారణ చర్యలు చేపట్టారు. అలాగే దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ కోసం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇంటింటి సర్వే చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. మొత్తం 749 గృహాలను సందర్శించిన ఆరోగ్య సిబ్బంది నీటి నిల్వలను పరిశీలించగా, 27 గృహాల్లో లార్వా ఉన్నట్లు గుర్తించి వెంటనే నిర్మూలన చర్యలు చేపట్టారు. జ్వరంతో బాధపడుతున్న 31 మందిని గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించినట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

# యుద్ధప్రాతిపదికన వరి కొనుగోలు ప్రక్రియ

**వనపర్తి, సమయం ప్రతినిధి:** రోజుకు 10వేల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేసి మిల్లులకు తరలించేందుకు పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక రైతులకు ఇబ్బందులు రాకుండా యుద్ధప్రాతిపదికన వరి కొనుగోలు ప్రక్రియ – జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన వడ్లను ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి తరలించేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం మొక్క జొన్న, వరి కొనుగోలు పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సహచర మంత్రులు, ప్రధాన కార్యదర్శితో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు.ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని, గోదాములు, ట్రాన్స్పోర్ట్, హమాలీల సమస్యలు జిల్లాస్థాయిలోనే కలెక్టర్లు పర్యవేక్షించి పరిష్కరించుకోవాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసే బాధ్యత కలక్టర్లదే అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనంతరం జిల్లా అధికారులకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు 10 వేల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసి మిల్లులకు, గోదాములకు తరలించాలని ఆదేశించారు. సెక్టార్ వారిగా ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు ఒప్పందం చేసుకున్న దానిప్రకారం స్వంత వాహనాలతో సహా వారు చెప్పిన అద్దె వాహనాలు అన్ని ధాన్యం తరలించేందుకు కేటాయించాల్సిందే అని తెలిపారు. ఒకవేళ ఒప్పందం ప్రకారం లారీలు పెట్టుకుంటే వెంటనే చీటింగ్ కేసు బుక్ చేయాలని, గత సీజన్ తో పాటు ఈ సీజన్ డబ్బులు సైతం ఇవ్వకుండా నిలుపుదల చేయాలని ఆదేశించారు. ట్రాన్స్పోర్ట్, పోలీస్ అధికారులు పనిచేస్తూ రవాణా వాహనాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న లారీ అసోసియేషన్ లతో మాట్లాడి జిల్లాకు సంబంధించిన అన్ని లారీలు, డి.సి.యం. లు ధాన్యం తరలించేందుకు వినియోగించుకోవాలని ట్రాన్స్పోర్ట్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ గోదాములు ధాన్యం నిల్వలకు తీసుకోవాలని, గోదాములను గుర్తించి జాబితా ఇవ్వాలని సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. గోదాములతో పాటు సీజ్ చేసిన రైస్ మిల్లులను ధాన్యం నిల్వ చేసేందుకు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులో లేదా గోదాములో డౌన్లోడ్ చేసుకోవాలని అవసరమైతే పోలీస్ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. అగ్రిమెంట్ చేసుకున్న అన్ని 53 మిల్లులకు ప్రతి రోజు వడ్లు పంపించి వెంటనే డౌన్లోడ్ జరిగేవిధంగా చూడాలన్నారు. అన్ని మిల్లుల వద్ద ప్రభుత్వ సిబ్బందిని పెట్టి రోజువారీ వడ్లు డౌన్లోడ్ ప్రక్రియను పర్యవేక్షించి నివేదిక ఇచ్చేవిధంగా చూడాలని చెప్పారు.హమాలీల సమస్య లేకుండా చూడాలని లేబర్ కమిషనర్ ను ఆదేశించారు. కొనుగోలు కేంద్రం పెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు వచ్చిన మొత్తం ధాన్యం ఎంత ఈ రోజు కొనుగోలు చేసి



తరలించిన ధాన్యం ఎంత అనే వివరాలు ప్రతి రోజు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈరోజు నుండి ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యే వరకు రోజువారీ డేటాను మీడియాకు ఇవ్వాల్సిందిగా సూచించారు. రానున్న 15 రోజులు అదనపు కలెక్టర్ రెవెన్యూ తో సహా సివిల్ సప్లై, మార్కెటింగ్, వ్యవసాయ,డి.ఆర్.డి.ఓ, డి.సి.ఓ, ట్రాన్స్పోర్ట్ తదితర శాఖలు అన్ని వడ్లు కొనుగోలు పైనే దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.అదనపు కలెక్టర్ రెవిన్యూ వినోద్ కుమార్, పి డి ఆర్ డి ఓ ఉమాదేవి, జిల్లా సివిల్స్ పై అధికారి కాశీ విశ్వనాథ్, డి.ఎం. ఆంజనేయులు జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు కోపరేటివ్ అధికారి బి రాణి ట్రాన్స్పోర్ట్ అధికారి మానస మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# మెట్‌గాలాలో భారతీయం

**ఏటా న్యూయార్క్‌లో జరిగే 'మెట్ గాలా'లో ఈసారి భారతీయ వారసత్వం ధగధగలాడింది. ప్రముఖ పారిశ్రామికవేత్త మేఘా కృష్ణారెడ్డి సతీమణి సుధారెడ్డి, రిలయన్స్ ఇండస్ట్రీస్ వారసురాలు ఇషా అంబానీ, జైపూర్ రాజవంశీకురాలు రాకుమారి గౌరవి కుమారి అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. వీరితోపాటు లారెన్ వాసర్, ఆరియానా ఫిలిప్ అనే ఇద్దరు విభిన్నమైన వనితలు తమ ప్రత్యేకతను చాటుకున్నారు.**

*సమయం ప్రతినిధి*

ఈ మెగా షోలో ప్రధాన ఆకర్షణ ప్రముఖ పారిశ్రామికవేత్త మేఘా కృష్ణారెడ్డి సతీమణి మేఘా సుధారెడ్డి. ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా 'ట్రీ ఆఫ్ లైఫ్' థీమ్‌తో ప్రత్యేకంగా రూపొందించిన డ్రెస్‌లో అబ్బురపరిచారు. ఈ లుక్‌కు మరింత వన్నె తెచ్చేలా ఖరీదైన కంఠాభరణంలో మెరిసిపోయారు. దీని విలువ సుమారు రూ.142 కోట్లు ఉంటుందని అంచనా. త్రికోణాకారపు రోజ్‌కట్ డైమండ్స్‌తో ప్రముఖ స్టైలిస్ట్ మారియల్ హెనిన్ దీన్ని రూపొందించారు. హారం లాకెట్‌లో ఖరీదైన 550 కేరెట్ల ముదురు ఊదా నీలం రంగు టాంజానియా వజ్రాన్ని పొదిగారు. మెరిలానీ క్వీన్'గా పిలిచే ఆకర్షణీయమైన ఈ లాకెట్ టాంజానియాలోని మెరిలానీ ప్రాంతానికి చెందినదిగా చెబుతారు. దానికి జతగా చేతి వేళ్లకు 30 క్యారెట్ల పోల్కి డైమండ్ రింగ్, 40 క్యారెట్ల యాషర్ కట్ కొలంబియన్ పచ్చను ధరించారు. ఆమె ధరించిన డ్రెస్‌ను మచిలీపట్టణం కలంకారీ శైలిలో సహజ రంగులు అద్ది, చేతితో నేశారు. మన నేల సంస్కృతిని ప్రతిబింబించేలా పాలపిట్ట, జమ్మిచెట్టు, తంగేడు పువ్వు, సూర్య, చంద్ర ఆకృతులు అందులో పొందుపరిచారు. దీని తయారీకి 90 మంది హస్తకళాకారులు 3,400 గంటలకు పైగా శ్రమించారు. 'వీటన్నిటి వెనుకా ఉన్న మానవ స్పర్శే నన్ను కదిలిస్తుంది. వేలాది గంటలు, లెక్కలేనన్ని చేతులు, తరతరాల జ్ఞానం అల్లుకుని ఈ ఒకేఒక్క క్షణాన్ని తీర్చిదిద్దుకున్నాయి' అంటూ ఈ ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో సుధారెడ్డి పోస్ట్ చేశారు. ఇంకా... హైదరాబాద్ కేవలం తన జన్మస్థలం మాత్రమే కాదని, అది ఒక భాష, ఒక లయ, ఒక ప్రయాణం అని రాసుకొచ్చారు.

## ఇషా.. 400 ఏళ్లనాటి చరిత్ర

ఇషా అంబానీ ధరించిన గోల్డెన్ టిష్యూ సిల్క్ శారీని ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించారు. అయితే, అందరి కళ్లు ఆమె ధరించిన బ్లౌజ్‌పైనే నిలిచాయి. ఎందుకంటే అది అరుదైన వజ్రాల సమాహారం. దాదాపు 1,800 క్యారెట్ల వజ్రాలను ఈ బ్లౌజ్ కోసం ఉపయోగించారు. మరీ ముఖ్యంగా, హైదరాబాద్ నిజాంలు తమ తలపాగాకు ధరించే 'సర్పేచ్' అనే చారిత్రక ఆభరణాన్ని ఈ బ్లౌజ్ వెనుక భాగంలో బ్రూచ్‌గా అమర్చారు. నీతా అంబానీ వ్యక్తిగత సేకరణ నుంచి తీసుకున్న ఈ ఆభరణం పచ్చలు, వజ్రాలు, కుందన్ పనితనంతో మెరిసిపోతూ భారతీయ కళావైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

ఈ వేడుకలో ఇషా ధరించిన మరో అరుదైన వస్తువు మొఘల్ చక్రవర్తి షాజహాన్‌కు చెందిన బ్రేస్‌లెట్. 17వ శతాబ్దానికి చెందిన ఈ ఆభరణంలో వజ్రాలు, కెంపులు, స్పినెల్స్ పొదిగి ఉన్నాయి. 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పురాతన బ్రేస్‌లెట్ విలువ రూ. 200 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. ఒక చక్రవర్తి వాడిన ఆభరణాన్ని ఆధునిక ఫ్యాషన్‌కు జోడించి ఇషా అంబానీ అందరినీ ఆశ్చర్యపరిచారు. దీనిని సుమారు 50 మంది కళాకారులు 1,200 గంటలపాటు శ్రమించి రూపొందించారు. 1953లో బరోడా మహారాణి సీతాదేవి తన కాలి పట్టీలలోని పచ్చలు, వజ్రాలను అమెరికన్ వ్యాపారి హ్యారీ విన్‌స్టన్‌కు విక్రయించగా, ఆయన వాటితో ఒక అద్భుతమైన నెకట్లెసను తయారుచేశారు. ఆ చారిత్రక హారాన్ని అంబానీ కుటుంబం సొంతం చేసుకుని ఈ వేడుక కోసం తిరిగి వినియోగించడం విశేషం.

## అమ్మమ్మ చీరలో రాకుమారి

జైపూర్ రాజవంశీకురాలు రాకుమారి గౌరవి కుమారి ఈ వేడుకలో తన అరంగేట్రంతో అందరి దృష్టినీ ఆకర్షించారు. ఆధునిక డిజైన్లపై మోజుతో కాకుండా.. తన కుటుంబ మూలాలను, గతాన్ని గౌరవిస్తూ ఆమె ఎంచుకున్న ఆహార్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. గౌరవి ధరించిన దుస్తులు ఒక కథను చెప్పాయి. ప్రపంచంలోనే అత్యంత అందగత్తెగా గుర్తింపు పొందిన తన అమ్మమ్మ, దివంగత జైపూర్ మహారాణి గాయత్రీదేవికి చెందిన అసలైన పింక్ షిఫాన్ చీరను ఆమె ఎంచుకున్నారు. ఆ వింటేజ్ చీరను ప్రఖ్యాత డిజైనర్ ప్రబల్ గురుంగ్ ఒక స్టైలిష్ గౌనుగా మలిచారు.

## విభిన్న మోడళ్లు

పుట్టుకతోనే వెంటతెచ్చుకున్న వైకల్యానికి కొంతమేరకు సర్దుకుపోవచ్చు. కానీ కెరీర్‌ను మలుచుకునే కీలకమైన వయసులో ఊహించని పరిణామంతో అంగవైకల్యం ప్రాప్తిస్తే, ఆ వేదనను, బాధను అధిగమించడం చాలా కష్టం. దురదృష్టవశాత్తూ, లారెన్ వాసర్‌కు అదే దుస్థితి ఎదురైంది. 24 ఏళ్ల వయసులో ఈ మోడల్, యాక్టివిస్ట్... టాక్సిక్ షాక్ సిండ్రోమ్‌కు గురైంది. టాంపన్ వాడకంతో ముడిపడి ఉండే ఈ సమస్య లారెన్ విషయంలో అవయవ విచ్ఛేదానికి దారి తీసింది. 2012లో ఎడమ కాలునూ, 2018లో కుడికాలునూ కోల్పోయిన లారెన్, అర్ధాంతరంగా అంగవైకల్యం బారిన పడింది. దాంతో ఆమె మోడలింగ్ కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది. ఎనిమిది నెలల పాటు వీల్‌చైర్‌కే పరిమితమైన సమయంలో, తన భావోద్వేగాలను ఏమాత్రం దాచుకోలేకపోయిందామె. భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోవడంతో, తాను తీవ్రంగా కుంగిపోయాననీ, బాత్రూంలో ఏడుస్తూ ఉండిపోయేదాన్ననీ ఒక సందర్భంలో బహిరంగంగా చెప్పుకుంది. ఇక మీదట మోడలింగ్ పరిశ్రమ తననెప్పటికీ ఆదరించదని అనుకున్నానని కూడా చెప్పుకుంది. నిజానికి అదే నిజాయితీ ఆమె కెరీర్‌కు దన్నుగా మారింది.

## బంగారం కాళ్ల అమ్మాయిగా...

కాలం ఎంతటి గాయాన్నైనా మాన్పుతుందని అంటారు. అదే విధంగా లారెన్ కాలి గాయాలు, మానసిక గాయాలూ మానిపోయాయి. గాయాల నుంచి కోలుకోగానే, బంగారంతో తయారైన కృత్రిమ కాళ్లను ధరించడం మొదలుపెట్టిందామె. అంతే కాకుండా టాక్సిక్ షాక్ సిండ్రోమ్ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం కోసం, కృత్రిమ కాళ్లనే ఫ్యాషన్ భాషగా మార్చుకుని, ఫ్యాషన్ షోలలో ప్రదర్శించడం మొదలుపెట్టింది. అప్పటి నుంచి ఆమెకు 'ది గర్ల్ విత్ గోల్డెన్ లెగ్స్' అనే పేరొచ్చింది. తాజా మెట్‌గాలాలో సైతం బంగారంలా మెరిసేపోయే దుస్తులతో, బంగారంతో తయారైన కృత్రిమ కాళ్లతో పవర్‌ఫుల్ ఫ్యాషన్ ఫిగర్‌గా తన ఉనికిని చాటుకుంది.

## ఆరియానా రోజ్ ఫిలిప్

ఆరియానా, 2001, మార్చి 11న ఆంటిగ్వాలో క్వాడ్రాప్లెజిక్ సెరిబ్రల్ పాల్సీతో పుట్టింది. మూడేళ్ల వయసులో ఆమెతో పాటు ఆమె కుటుంబం అమెరికాకు వలస వెళ్లిపోయి, న్యూయార్క్‌లో స్థిరపడింది. తనంతట తాను ఏ పనీ చేసుకోలేని ఆరియానా, తన వైకల్యానికి కుంగిపోకపోగా, 14 ఏళ్ల వయసు నుంచే బ్లాగులు రాయడం మొదలుపెట్టి, తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించింది. 2016లో, 14 ఏళ్ల వయసులో ఆరియానా రాసిన 'దిస్ కిడ్ కెన్ ఫ్లై: ఇట్స్ ఎబౌట్ అబిలిటీ(నాట్ డిసబిలిటీ) మెమొయిర్‌తో రచయితగా గుర్తింపు పొందింది. ఈ పుస్తకం ద్వారా, క్వాడ్రాప్లెజిక్ సెరిబ్రల్ పాల్సీతో బాల్యంలో తానెదుర్కొన్న అనుభవాలను వివరించింది ఆరియానా. ఆ తర్వాత ఎడిటోరియల్ ఫీచర్స్‌తో ఫ్యాషన్ ప్రపంచంలోకి ప్రవేశించి, తన మోడలింగ్ కెరీర్‌ను మలుచుకుంది. 2018లో మొట్టమొదటి నల్ల జాతి ట్రాన్స్‌జెండర్, దివ్యాంగ మోడల్‌గా ఒక ప్రముఖ మోడలింగ్ ఏజెన్సీకి ప్రాతినిధ్యం వహించింది. అప్పటి నుంచి ప్రముఖ ఫ్యాషన్ ఫొటో షూట్స్, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ తనదైన ప్రత్యేక గుర్తింపు సాధించింది. 2022, మోషినోస్ స్ప్రింగ్/సమ్మర్ షోలో ప్రధాన లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ వాక్ కోసం, వీల్‌చైర్ వాడుకున్న మొట్టమొదటి మోడల్‌గా కూడా గుర్తింపు పొందింది. తాజా మెట్ గాలాలో సైతం వీల్‌చైర్‌లో మెరిసిన మొట్టమొదటి రన్‌వే మోడల్‌గా పేరు పొందింది.

'గళమెత్తిన దివ్యాంగులను కార్యకర్తలుగా ముద్ర వేయడం పరిపాటిగా మారిపోయింది. మా శరీరాల్లో వైకల్యాలూ, మాకు కల్పించవలసిన వసతుల గురించి ఎవరికీ ఎటువంటి అవగాహనా ఉండదు. ఇలాంటి సామాజిక వ్యవస్థను సవాలు చేస్తూ ఉంటాం కాబట్టి మాకు కార్యకర్తలనే బిరుదులిస్తూ ఉంటారు. ఎన్నో ఏళ్లుగా దివ్యాంగులకు ఎక్కడా, ఏ వేదిక మీదా ప్రాతినిధ్యం ఉండేది కాదు. మెట్ గాలా లాంటి ఇలాంటి కార్యక్రమాల్లో తాము కూడా పాల్గొనగలుగుతామనే ఆలోచనే దివ్యాంగులకు ఉండేది కాదు. ఆ స్థితి నుంచి ఎదిగి, మెట్ గాలాలో హాజరయ్యే స్థాయికి చేరుకోగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది' అంటూ మెట్‌గాలా వేదికగా తన ఆనందాన్ని పంచుకుంది.

---



# ప్రజాక్షేత్రంలో మహిళా వికాసం

**ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు మహిళా అభ్యర్థులు ప్రత్యేకతను చాటుకున్నారు. విభిన్న వర్గాలు... భిన్న నేపథ్యాల నుంచి వచ్చిన వీరు... ప్రత్యర్థులను వెనక్కు నెట్టి విజేతలుగా నిలిచారు. రాజకీయాల్లో తమదైన ముద్ర వేసేందుకు... ప్రజల పక్షాన చట్ట సభల్లో తమ వాణి వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. వారే వీరు...**

*సమయం ప్రతినిధి*

## తొలి అడుగులోనే చరిత్ర

"ఒక మహిళగా జీవించాలంటే ఎంతో శ్రమ పడాలి. హిజాబ్ ధరించి జీవించడానికి మరింత కష్టపడాలి. ఒక మహిళగా, ముస్లిం మహిళగా, హిజాబ్ ధరించే ముస్లిం మహిళగా... ఇక్కడికి చేరుకోవడానికి ఇప్పటికే ఎన్నో అవరోధాల్ని అధిగమించాను..."ఇటీవలి కేరళ ఎన్నికల ప్రచారం సందర్భంలో ఫాతిమా తహిలియా చెప్పిన మాటలివి. ఆ తరువాత... తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన ఆమె... అసెంబ్లీలో అడుగు పెట్టడానికి ఆఖరి అవరోధాన్ని కూడా దాటేశారు. 78 ఏళ్ళ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) తరఫున చట్టసభలకు ఎన్నికైన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు.

## ఎన్నెన్నో వివాదాలు...

కోళికోడ్‌లోని పెరంబ్రా నియోజకవర్గం అభ్యర్థిగా ఫాతిమా పేరును (ఐయూఎంఎల్) ప్రకటించినప్పటి నుంచి ఎన్నో వివాదాలకు ఆమె కేంద్రబిందువయ్యారు. సైబర్ దాడులను, ఆన్‌లైన్ వేధింపులను, దూషణలను ఆమె ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆమె సోషల్ మీడియా ఖాతాల్లో అశ్లీలమైన వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. హిజాబ్ ధరించిన మహిళగా ఆమె పాలనా సామర్థ్యంపై అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. ఒక వైపు ప్రచారంలో తీరికలేని ఫాతిమా... వీటన్నిటినీ తట్టుకోడానికి చాలా శ్రమపడాల్సి వచ్చింది. అయితే మహిళల నుంచి, యువత నుంచి ఆమెకు అద్భుతమైన మద్దతు లభించింది.

## వేధింపులపై గొంతు విప్పి...

కోళికోడ్‌లోని పెరువయల్‌లో పుట్టిన ఫాతిమా కాలికట్ యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదివారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లో ప్రవేశించిన ఆమె 'ముస్లిం స్టూడెంట్స్ ఫెడరేషన్' (ఎంఎ?సఎఫ్) క్రియాశీలకంగా పని చేశారు. దానికి జాతీయ ఉపాధ్యక్షురాలుగా నియమితురాలయ్యారు. 'ముస్లిం యూత్ లీగ్' రాష్ట్ర కార్యదర్శిగానూ వ్యవహరించారు. కాగా... ఐయుఎంఎల్‌లో 2021లో లైంగిక వేధింపులకు గురయ్యామంటూ గొంతు విప్పిన మహిళల్లో ఫాతిమా ఒకరు. ఈ వివాదం నేపథ్యంలో ఎంఎ?సఎఫ్ జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి పార్టీ ఆమెను తొలగించింది. కొన్ని రోజుల తరువాత... ఆమె తొలి అధ్యక్షురాలిగా, ప్రధాన కార్యదర్శిగా పని చేసిన ఎంఎ?సఎఫ్ మహిళా విభాగం 'హరిత' రాష్ట్ర కమిటీని కూడా ఐయుఎంఎల్ రద్దు చేసింది. దీంతో పార్టీకి ఫాతిమా పూర్తిగా దూరమైనట్టేనని పరిశీలకులు భావించారు. కానీ ఆమె తిరిగి పార్టీలోకి రావడం, పెరంబ్రా నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీకి దిగడం సంబంధిత వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది.

## మార్పు దిశగా...

1948లో స్థాపించిన ఐయుఎంఎల్‌కు కేరళలో, ప్రధానంగా మలబార్ ప్రాంతంలో మంచి పట్టుంది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, కర్ణాటకలో నామమాత్రమైన ఉనికి కూడా ఉంది. ఆ పార్టీ 1996లో, 2021లో కేరళలో మహిళలను పోటీలో నిలబెట్టింది. కానీ వారు ఓడిపోయారు. ఆ తరువాత... తాజా ఎన్నికల్లో ఇద్దరు మహిళలకు టిక్కెట్ ఇచ్చింది. వారిలో ఫాతిమా ఒకరు. సీపీఎం సీనియర్ నాయకుడు టి.పి.రామకష్ణపై ఆమె అయిదువేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వడం, అంతర్గత ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచడం దిశగా ముస్లిం లీగ్‌లో మార్పులకు దోహదం చేసే పరిణామంగా... ఫాతిమా గెలుపునకు ప్రాధాన్యం ఉంది.

## అంట్లు తోమిన చేతులతో..

ఒక సామాన్య గృహ కార్మికురాలు ప్రజా ప్రతినిధిగా ఎదగడం అంటే అది గెలుపు మాత్రమే కాదు.. భారత ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనం. పశ్చిమ బెంగాల్‌లోని ఔస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందిన కలితా మాఝీ ప్రస్థానం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## రూ. 2,500 జీతం నుంచి..

బహుశా ఏ రాజకీయ నాయకుడి అఫిడవిట్‌లోనూ ఇంత తక్కువ ఆస్తులు కనిపించవేమో! కలితా మాఝీ దాదాపు రెండు దశాబ్దాలపాటు ఇళ్లలో పాచి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించారు. నెలకు కేవలం రూ. 2,500 సంపాదనతో జీవనం సాగించిన ఆమె నేడు తన నియోజకవర్గ ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపించబోతున్నారు. 38 ఏళ్ల కలిత భర్త సుబ్రతా మాఝీ దినసరి కూలీ.

## ఓటమి నుంచి నేర్చుకున్న పాఠం

కలితా మాఝీ రాజకీయాల్లోకి ఒక్క రోజులోనే రాలేదు. గత దశాబ్ద కాలంగా బూత్‌స్థాయి కార్యకర్తగా పార్టీ కోసం పనిచేశారు. 2021 ఎన్నికల్లో బీజేపీ ఆమెకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆమె కుంగిపోలేదు. తన నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతూ క్షేత్రస్థాయిలో పట్టు సాధించారు. ఫలితంగా తాజా ఎన్నికల్లో మళ్లీ అవకాశం లభించింది. టీఎంసీ అభ్యర్థి శ్యామ ప్రసన్న లహోరీపై 12,535 ఓట్ల మెజారిటీతో అద్భుత విజయాన్ని అందుకున్నారు. ఆమెకు లక్షకు పైగా ఓట్లు రావడం ఆమె మంచితనానికి, పట్టుదలకు నిదర్శనం.




ఇంటర్నెట్ డెస్క్: భారత రెజ్లింగ్ సమాఖ్యపై స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ చేస్తోన్న పోరాటానికి ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ మద్దతుగా నిలిచారు. రెజ్లింగ్‌లో రీఎంట్రీ ఇవ్వాలనుకుంటున్న వినేశ్‌కు డబ్ల్యూఎఫ్ఐ అనుమతి నిరాకరించడంపై సాక్షి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గొండాలో జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనకుండా వినేశ్‌పై డబ్ల్యూఎఫ్ఐ అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. రిటైర్‌మెంట్ నిబంధనలు, యాంటీ డోపింగ్ ప్రక్రియలను కారణంగా చూపుతూ వినేశ్ ప్రస్తుతం పోటీలకు అనర్హురాలని డబ్ల్యూఎఫ్ఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సాక్షి మాలిక్ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. వినేశ్‌కు మద్దతుగా నిలిచారు.

'ఇతర దేశాల్లో అథ్లెట్లు తల్లి అయిన తర్వాత కూడా పతకాలు సాధించేలా ఫెడరేషన్లు నిబంధనలను సడలిస్తాయి. కానీ మన దగ్గర మాత్రం వినేశ్ రీఎంట్రీ ఇవ్వకుండా.. ఉద్దేశపూర్వకంగానే పోటీకి రెండు రోజుల ముందు కొత్త నిబంధనలను పెట్టి అడ్డుకున్నారు. తల్లి అయిన తర్వాత వినేశ్ తిరిగి రెజ్లింగ్‌లోకి రావాలని అనుకోవడం ప్రశంసించాల్సిన విషయం. మహిళా క్రీడాకారులకు మాతృత్వం తర్వాత మరింత సహకారం అందించాల్సింది పోయి.. ఇలాంటి అడ్డంకులు సృష్టించడం బాధాకరం. ప్రధాని నరేంద్ర మోదీ, క్రీడాశాఖ మంత్రితో పాటు డబ్ల్యూఎఫ్ఐను విజ్ఞప్తి చేస్తున్నా. వినేశ్‌కు ట్రయల్స్ అవకాశం ఇవ్వాలి. ఆమె దేశానికి పతకాలు సాధించి మహిళలు మాతృత్వం తర్వాత కూడా క్రీడల్లో రాణించగలరని నిరూపించాలి' అని సాక్షి మాలిక్ ఆ వీడియోలో పేర్కొన్నారు.

ఇదిలా ఉంటే ప్రపంచ యాంటీ డోపింగ్ సంస్థ (వాడా) రూల్ 5.6.1 ప్రకారం 2026 జూన్ 26 వరకు వినేశ్ తిరిగి పోటీల్లో పాల్గొనలేదని డబ్ల్యూఎఫ్ఐ స్పష్టం చేసింది. అయితే 2025 జులై 3న ఇంటర్నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇచ్చిన లేఖను వినేశ్ బయటపెట్టారు. అందులో 2026 జనవరి 1 నుంచే తాను పోటీలకు అర్హురాలినని పేర్కొన్నట్టు సమాచారం. ఇక 2025 డిసెంబర్‌లో డోపింగ్ టెస్టుకు హాజరు అవ్వలేదనే అంశంపై కూడా వినేశ్‌కు డబ్ల్యూఎఫ్ఐ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే ఆ సమయంలో వినేశ్ తన నవజాత శిశువు సంరక్షణతో పాటు హరియాణా అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు హాజరవుతున్నానని వివరణ ఇచ్చిన సంగతి తెలిసిందే.




ఇంటర్నెట్ డెస్క్: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గొండాలో జరుగుతున్న జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనకుండా భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) ఆమెపై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. అయినా సరే.. పోటీలో పాల్గొనేందుకు వినేశ్ గొండాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్‌తో సమావేశమయ్యారు. అనంతరం వినేశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆసియా క్రీడల్లో పాల్గొనకుండా ఉండాలనేదే డబ్ల్యూఎఫ్ఐ లక్ష్యమని ఆమె ఆరోపించారు. తాను మళ్లీ పతకాలు గెలుస్తానని వారు భయపడుతున్నారని విమర్శించారు.

2024 పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హతకు గురైన తర్వాత నా జీవితంలోనే ఆనందాన్ని కోల్పోయాను. కానీ నా కుమారుడు క్రిధవ్ తిరిగి నాలో ఉత్సాహాన్ని తీసుకొచ్చాడు. వ్యవస్థపై పోరాడే శక్తి నా కొడుకు వల్లే వచ్చింది. నాపై అనర్హత వేటు వేసినట్టు శుక్రవారం రాత్రి నోటీసు అందింది. దానికి సమాధానం ఇచ్చేందుకు 14 రోజుల గడువు ఇచ్చారు. ఇదే విషయాన్ని డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్‌కు తెలిపాను. సమయం లేకపోవడం వల్ల ఆ నోటీసులకు క్లుప్తంగానే సమాధానం ఇచ్చాను. తొలుత నన్ను పోటీ చేయడానికి అనుమతి ఇవ్వమని సంజయ్ సింగ్‌ను కోరాను. 14 రోజుల తర్వాత నా సమాధానంతో సంతృప్తి చెందకపోతే చర్యలు తీసుకోమని చెప్పాను. కానీ సంజయ్ సింగ్ దానికి అంగీకరించలేదు. నేను మళ్లీ పతకాలు గెలుస్తానని డబ్ల్యూఎఫ్ఐ భయపడుతోంది.




ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కొత్త యువ హీరో దొరికాడు. పంజాబ్ కింగ్స్‌పై జరిగిన కీలక మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఉత్కంఠ పోరులో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో డీసీ యువ ఆల్‌రౌండర్ మాధవ్ తివారీ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. బంతితో రెండు కీలక వికెట్లు తీయడమే కాకుండా.. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. అసలు ఇంతకీ ఎవరీ మాధవ్ తివారీ...!




ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో భాగంగా సోమవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఉత్కంఠ పోరులో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విజయంతో డీసీ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. జట్టు గెలిచినప్పటికీ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు మాత్రం బీసీసీఐ షాక్ ఇచ్చింది. ధర్మశాలలో జరిగిన మ్యాచ్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోవడంతో స్లో ఓవర్‌రేట్ కారణంగా బీసీసీఐ అక్షర్‌కు రూ.12 లక్షల జరిమానా విధించింది. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఈ సీజన్‌లో ఢిల్లీకి ఇది తొలి తప్పిదం కావడంతో జరిమానాతో సరిపెట్టింది. ఐపీఎల్ 2026లో స్లో ఓవర్ రేట్ సమస్య పలువురు కెప్టెన్లకు తలనొప్పిగా మారింది. ఇప్పటికే శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యలపై కూడా బీసీసీఐ చర్యలు తీసుకుంది. గతంలో ఒకే జట్టు పదేపదే స్లో ఓవర్ రేట్‌కు పాల్పడితే కెప్టెన్లపై సస్పెన్షన్ విధించే నిబంధన ఉండేది. అయితే 2025 నుంచి ఆ నియమాన్ని బీసీసీఐ రద్దు చేసింది. ఇదిలా ఉంటే, పంజాబ్ కింగ్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ సంచలన విజయం సాధించింది. 211 పరుగుల భారీ లక్ష్యాన్ని 19 ఓవర్లలోనే ఛేదించింది. కెప్టెన్ అక్షర్ పటేల్(56), డేవిడ్ మిల్లర్(51) హాఫ్ సెంచరీలు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. దీంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి.




ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026 ముగింపు దశకు చేరుకోవడంతో ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. ప్లే ఆఫ్స్ బెర్తే లక్ష్యంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. టాస్ నెగ్గిన ఎస్ఆర్‌హెచ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో గుజరాత్ తొలుత బ్యాటింగ్‌కు దిగనుంది. 11 మ్యాచుల్లో 7 విజయాలతో 14 పాయింట్లు నెగ్గి పట్టికలో రెండో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్‌కు మరో గెలుపు ప్లే ఆఫ్స్ బెర్తును దాదాపుగా ఖాయం చేస్తుంది. సరిగ్గా అవే గణాంకాలతో మూడో స్థానంలో ఉన్న గుజరాత్‌దీ అదే పరిస్థితి. దీంతో ఈ పోరు ఫలితం ప్లే ఆఫ్స్ సమీకరణంలో కీలకం కానుంది.

ఎస్ఆర్‌హెచ్ తుది జట్టు

ప్యాట్ కమిన్స్(కెప్టెన్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా, నితీశ్ కుమార్ రెడ్డి, స్మరన్ రవిచంద్రన్, శివాంగ్ కుమార్, ఎషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగే

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: ట్రావిస్ హెడ్, లియామ్ లివింగ్‌స్టోన్, అనికేత్ వర్మ, హర్షల్ పటేల్, హర్ష్ దూబె

గుజరాత్ టైటాన్స్ తుది జట్టు

శుభ్‌మన్ గిల్(కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, జాసన్ హోల్డర్, నిశాంత్ సింధు, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, అర్షద్ ఖాన్, రబాడా, సిరాజ్

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: ప్రసిద్ధ్ కృష్ణ, సాయి కిషోర్, అనుజ్ రావత్, కుమార్ కుషాగ్రా, ఫిలిప్స్




ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి సంబంధించిన సోషల్ మీడియా వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. జర్మన్ మోడల్, సింగర్ లిజ్‌లాజ్ ఇన్‌స్టా ఫొటోకు కోహ్లీ లైక్ కొట్టిన అంశం వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ విషయంపై లిజ్‌లాజ్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేసింది. కోహ్లీపై తప్పుడు ఆరోపణలు చేయాలని కొందరు జర్నలిస్టులు తనను సంప్రదించారని.. అందుకు డబ్బు కూడా ఆఫర్ చేశారని ఆమె వెల్లడించింది. కోహ్లీ నా ఫొటోకు లైక్ కొట్టడంతో అనూహ్యంగా నేను సోషల్ మీడియాలో వైరల్ అయ్యాను. ఆ ఘటన తర్వాత పలువురు జర్నలిస్టులు నా దగ్గరికి వచ్చారు. కోహ్లీ గురించి చెడుగా మాట్లాడాలని, అతడు చేయని పనులపై కూడా ఆరోపణలు చేయాలని కోరారు. నాకు డైరెక్ట్‌గా మెసేజ్‌లు చేస్తున్నట్లు చెప్పమన్నారు. దానికి నాకు భారీగా డబ్బు కూడా ఆఫర్ చేశారు. కానీ నేను అలా ఎందుకు చేస్తాను? విరాట్ అంటే నాకు పిచ్చి అభిమానం. డబ్బు లేదా పాపులారిటీ కోసం అతడి ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశం నాకు లేదు' అని లిజ్‌లాజ్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. 'అందుకే కోహ్లీ దేశాన్ని వదిలి వెళ్లాడు' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. జర్మనీకి చెందిన లిజ్‌లాజ్‌కు.. జర్మన్‌తో పాటు డచ్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్ భాషలపై కూడా పట్టు ఉంది. సైకాలజీలో ఎంఎస్సీ పూర్తి చేసిన ఆమె.. సర్టిఫైడ్ లైఫ్ సేవింగ్ స్విమ్మర్ కూడా. ఫుడ్ వ్లాగింగ్, ట్రావెలింగ్, సాంగ్ రైటింగ్ ఆమె హాబీలు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు, విరాట్ కోహ్లీకి తాను అభిమానిని అంటూ గతంలో లిజ్‌లాజ్ చెప్పిన సంగతి తెలిసిందే.




మన స్టార్ హీరోయిన్లు ఎప్పుడూ ఒకే ఇండస్ట్రీకి పరిమితం కావడానికి ఇష్టపడరు. సౌత్ నుంచి నార్త్‌కు, నార్త్ నుంచి హాలీవుడ్‌కు వెళ్లడం ఇప్పుడు ఒక ట్రెండ్‌గా మారింది. ఈ రేసులో ప్రియాంక చోప్రా అందరికంటే ముందు వరుసలో ఉంది. నిక్ జోనస్‌ను పెళ్లి చేసుకున్నాక గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన పీసీ, ఇప్పుడు 'వారణాసి' చిత్రంతో మళ్ళీ ఇండియన్ బాక్సాఫీస్ వైపు చూస్తోంది. మరోవైపు దీపికా పదుకొణె, అలియా భట్ కూడా ఇప్పటికే హాలీవుడ్ ప్రాజెక్టులతో తమ సత్తా చాటారు. ఇప్పుడు వీరి సరసన దిశా పటానీ పేరు కూడా గట్టిగా వినిపిస్తోంది. ఈ అమ్మడు సోషల్ మీడియాలో కేవలం ఒక్క ఫోటో షేర్ చేస్తే చాలు, ఇంటర్నెట్ షేక్ అవ్వాల్సిందే..! ఫిట్‌నెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా, కుర్రకారు కలల రాకుమారిగా మారిన దిశా పటానీ ఇప్పుడు తన రూట్ మార్చింది. కేవలం బాలీవుడ్, సౌత్ సినిమాలతోనే సరిపెట్టుకోకుండా.. గ్లోబల్ వైడ్‌గా తన జెండా పాతేందుకు సిద్ధమైంది. ప్రియాంక చోప్రా, దీపికా పదుకొణె బాటలో నడుస్తూ హాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీకి ప్లాన్ చేస్తోంది.

లేటెస్ట్ సమాచారం ప్రకారం, దిశా పటానీ ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్ అనే హాలీవుడ్ చిత్రంలో ఒక కీలక పాత్రకు ఎంపికైంది. ఇది మామూలు సినిమా కాదు.. హై-వోల్టేజ్ యాక్షన్, సైన్స్ ఫిక్షన్ డ్రామాగా తెరకెక్కనుంది. దిశాకు మార్షల్ ఆర్ట్స్ మరియు జిమ్నాస్టిక్స్‌లో మంచి పట్టు ఉంది. అందుకే ఇలాంటి ఫిక్షన్ సినిమాలకు ఆమె పర్ఫెక్ట్ ఛాయిస్ అని హాలీవుడ్ మేకర్స్ భావిస్తున్నారట. తన ఇన్స్టాగ్రామ్ పోస్టులతో ఇప్పటికే ఇంటర్నేషనల్ బ్రాండ్ల దృష్టిని ఆకర్షించిన దిశా, ఈ సినిమాతో వెస్టన్ ఆడియన్స్‌కు మరింత చేరువ కానుంది. దిశాకు హాలీవుడ్ కొత్తేమీ కాదు. గతంలోనే జాకీచాన్ నటించిన కుంగ్ ఫూ యోగా చిత్రంలో అమ్మడు మెరిసింది. కానీ, దురదృష్టవశాత్తు ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ సాధించలేకపోయింది. దాంతో హాలీవుడ్ కలలను పక్కన పెట్టి మళ్ళీ బాలీవుడ్‌లోనే బిజీ అయిపోయింది. కల్కి 2898 ఏడీ వంటి భారీ ప్రాజెక్టులతో మన దగ్గర క్రేజ్ సంపాదించుకున్న దిశా, ఈసారి మాత్రం హాలీవుడ్‌లో గట్టిగా కొట్టాలని ఫిక్స్ అయింది.

దిశా కేవలం గ్లామర్ మీద మాత్రమే ఆధారపడటం లేదు. ఆమె ఎంచుకుంటున్న కథలు, చేస్తున్న వర్కవుట్లు చూస్తుంటే హాలీవుడ్‌లో సెటిల్ అవ్వడానికి కావాల్సిన క్వాలిటీస్ అన్నీ ఆమెలో పుష్కలంగా ఉన్నాయి. కేవలం అందం ఉంటే సరిపోదు, హాలీవుడ్‌లో నిలదొక్కుకోవాలంటే అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ మరియు యాక్షన్ స్కిల్స్ ఉండాలి ఇదే సూత్రాన్ని దిశా ఫాలో అవుతోంది. సోషల్ మీడియాలో కుర్రకారుకు నిద్ర పట్టకుండా చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు హాలీవుడ్ యూత్‌ను ఏ రేంజ్‌లో మెప్పిస్తుందో వేచి చూడాలి. ఈ పోర్టల్ ఆఫ్ ఫోర్స్ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పుతుందా అనేది చూడాలి.







ఏ సినిమాలోనైనా మలుపులు ఉండకపోతే ఎక్కువసేపు చూడబుద్ధికాదు. అందుకే డైరెక్టర్స్.. అలా కథను మలుపు తిప్పడానికి ఒక క్యారెక్టర్ ని రాసుకుంటారు. ఆ క్యారెక్టర్ పండితే సినిమా హిట్ అయ్యినట్టే. తాజాగా పెద్దిలో అలాంటి క్యారెక్టరే అప్పల సూరి అని టాక్ నడుస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం పెద్ది. జగపతి బాబు, శివన్న, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తోన్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎన్నో వాయిదాల తరువాత జూన్ 4 న పెద్ది ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్ స్పీడు పెంచిన మేకర్స్ మే 18 న ట్రైలర్ రిలీజ్ కి ముహూర్తం పెట్టారు. ఇక ట్రైలర్ విషయం పక్కన పెడితే.. పెద్దిలో అప్పలసూరి పాత్ర కీలకమని, ఆ పాత్రనే సినిమాను మలుపు తిప్పుతోందని ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అప్పలసూరి పాత్రలో జగపతిబాబు నటించాడు. ఆయన ఫస్ట్ లుక్ రిలీజ్ చేసినప్పుడు అసలు ఎవరూ ఆయనను గుర్తుపట్టలేదు అంటే ఆశ్చర్యపోనవసరం లేదు. తెల్లబడిన జుట్టు, వడిలిపోయిన దేహం, ముఖంలో అసహనంతో కనిపించిన ఈ అప్పల సూరి ని చూసి అందరూ షాక్ అయ్యారు. జగపతిబాబు రంగస్థలంలో ప్రెసిడెంట్ క్యారెక్టర్ కంటే దారుణంగా పెద్దిలో కనిపించనున్నాడని అనుకున్నారు. కానీ, అందుతున్న సమాచారం ప్రకారం అప్పలసూరి పాత్ర కథనే మార్చేస్తుందంట. పెద్దికి దిశా నిర్దేశం చేస్తూ అతని లక్ష్యం వైపు అడుగులు వేయించేలా చేసే పాత్రలో జగ్గూభాయ్ కనిపించనున్నాడట. అంతేకాకుండా ఇంటర్వెల్ ఫైట్ కి దారితీసేది కూడా ఈ పాత్రనే అని చెప్పుకొస్తున్నారు. ఈ లెక్కన్న రంగస్థలం తరువాత మరో అద్భుతమైన పాత్రలో జగపతిబాబు నటించాడని తెలుస్తోంది. దీంతో ఈ పాత్రపై అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. ఇది కూడా క్లిక్ అయితే జగ్గూభాయ్ కెరీర్ లో ఇంకో మైలురాయిగా పెద్ది నిలుస్తోందని అభిమానులు చెప్పుకొస్తున్నారు. మరి ఈ సినిమాతో చరణ్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.




భారతదేశమంతటా 'పర్సంటేజ్ సిస్టమ్' అమలులో ఉందని, మన తెలుగు రాష్ట్రాలలోనే ఇది అమలు కావడం లేదని పర్సంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడతామని- లేకపోతే లేదని ఎగ్జిబిటర్స్ తేల్చి చెప్పారు. మంగళవారం పలువురు ఎగ్జిబిటర్స్ థియేటర్స్ మనుగడ కోసం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను మీడియా ముందు వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో చదలవాడ శ్రీనివాసరావు, సునీల్ నారంగ్, శిరీష్, విజయేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, అనుపమ్ రెడ్డి, శ్రీధర్, బాలగోవింద్ వంటి ప్రముఖ ఎగ్జిబిటర్స్ పాల్గొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 1400 సింగిల్ థియేటర్స్ నడుస్తున్నాయని, దాదాపు 1300 థియేటర్స్ బంద్ అయ్యాయని థియేటర్స్ యజమానులు గుర్తు చేశారు. మల్టీప్లెక్స్ థియేటర్స్ కు పదిహేనేళ్ళుగా నిర్మాతలు పర్సంటేజ్ ఇస్తున్నారని - సింగిల్ స్క్రీన్స్ పై సవతి ప్రేమ చూపిస్తున్నారని కొందరు వాపోయారు. ఇదే కొనసాగితే మరిన్ని థియేటర్స్ మూతపడే అవకాశం ఉందని వక్తలు తెలిపారు.

**మూడు నెలలే లాభాలు...** సింగిల్ థియేటర్స్ లో మోడరన్ టెక్నాలజీ అందుబాటులో లేదని కొందరు ఆరోపిస్తున్నారు. అదే సింగిల్ స్క్రీన్స్ లో సైతం పర్సంటేజ్ సిస్టమ్ అమలయితే, ఆ థియేటర్స్ సైతం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సాగుతాయని ఎగ్జిబిటర్స్ అన్నారు. పర్సంటేజ్ సిస్టమ్ లో మూడు నెలలు 'లాస్'లో నడచినా, తొమ్మిది నెలలు లాభాలు చూడవచ్చునని వారు అభిప్రాయపడ్డారు.




తెలుగు టెలివిజన్ డిజిటల్ మీడియా అండ్ ఓటిటి డబ్బింగ్ ఆర్టిస్ట్ యూనియన్ ఆఫ్ తెలంగాణ ప్రథమ వార్షికోత్సవాన్ని గ్రాండ్‌గా జరిపారు. మే 10, ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ వేడుకలో పలువురు సినీ, టీవీ ప్రముఖులు పాల్గొన్నారు. వారి సమక్షంలో మొట్టమొదటిసారిగా పలు డబ్బింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డబ్బింగ్ కళాకారులకు 'వాగ్దేవి అవార్డ్స్'ను బహూకరించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా నవీన్ యాదవ్ (జూబ్లీహిల్స్ శాసనసభ్యులు), ఈ గంగాధర్ (అడిషనల్ కమిషనర్ ఆఫ్ లేబర్, తెలంగాణ), నటుడు రాజీవ్ కనకాల, ఏ. ప్రసాదరావు (ఓటిటి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్), కొయ్యలమూడి రాకేష్ (నాని) ప్రెసిడెంట్), గోగినేని ప్రసాద్ (మూవీ డబ్బింగ్ ఆర్టిస్ట్ యూనియన్ ప్రెసిడెంట్), పి. ప్రభాకర్ (సినీ, టీవీ నటులు), కాదంబరి కిరణ్ (సినీ నటులు), ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్ రాజు (టీవీ డబ్బింగ్ ఆర్టిస్ట్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు) తదితరులు పాల్గొన్నారు.




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో ఓ క్రేజీ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ నుంచే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో ఈ చిత్రం నుంచి ఏ చిన్న అప్ డేట్ వచ్చినా క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా గ్లింప్స్ గురించి ఓ క్రేజీ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. గతంలో చిత్ర యూనిట్ ప్రకటించినట్లుగా, ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ మూవీ ఫస్ట్ గ్లింప్స్‌ను అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారట. దీంతో మే 20న నందమూరి అభిమానులకు అసలైన 'మాస్ ట్రీట్' లభించనుందని సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. అయితే నందమూరి అభిమానులు మే 20 వరకు వేచి చూడాల్సిన అవసరం లేకుండా, మే 19 అర్ధరాత్రికే ఈ సాలిడ్ గ్లింప్స్‌ను వదిలేందుకు ప్రశాంత్ నీల్ అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారట. అభిమానుల్లో ఉన్న ఉత్కంఠను దృష్టిలో ఉంచుకుని, పుట్టినరోజు ముందే ఈ కానుకను అందించాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్', 'సలార్' సినిమాలతో సరికొత్త ప్రపంచాలను సృష్టించిన నీల్, ఇప్పుడు తారక్ కోసం ఎలాంటి ఊహాతీతమైన లోకాన్ని సెట్ చేశారో చూడాలని యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ గ్లింప్స్ దాదాపు మూడు నిమిషాల పాటు ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఈ అప్‌డేట్‌తో సోషల్ మీడియాలో ఒక్కసారిగా సందడి పెరిగింది. ముఖ్యంగా మే 18న రామ్ చరణ్ 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటం, ఆ మరుసటి రోజే ఎన్టీఆర్ మూవీ గ్లింప్స్ రానుండటంతో టాలీవుడ్‌లో మెగా-నందమూరి ఫ్యాన్స్ హంగామా పీక్స్‌కు చేరుకుంది. వరుసగా ఇద్దరు స్టార్ హీరోల అప్‌డేట్స్ వస్తుండటంతో యూట్యూబ్ రికార్డులు తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085